నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: లక్ష్మీనగర్, కేంద్రీయ విహార్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు లైన్, రత్నదీప్ నమహా అపార్ట్‌మెంట్, బుద్ధా అపార్ట్‌మెంట్స్, 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు డోవా కాలనీ, అభయాంజనేయ స్వామి దేవాలయం, డైనమిక్ కాలనీ, అదేవిధంగా కేంద్రీయ విహార్ ఫీడర్ పరిధిలో 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్రికెట్ గ్రౌండ్ రోడ్డు, కొలంబస్ స్కూల్ రోడ్డు, 4 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్, రత్నదీప్ బ్యాక్ సైడ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు సమీపంలో నూతనంగా చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. డ్రైనేజీ సమస్య ఉన్నచోట ప్రథమ ప్రాధాన్యతగా పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లిగావాడ్ ఫౌండేషన్ సభ్యులు రామ్, చైతన్య, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్ ఉన్నారు.

అసంపూర్తి రోడ్లను పూర్తి చేస్తాం

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లో అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయువిహార్, హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, ఇంజినీరింగ్, జలమండలి, ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణ, జలమండలి మేనేజర్ ప్రియాంక, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భూభారతి చట్టం భూములకు రక్షణ కవచం

రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గాంధీ



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: భూభారతి చట్టం రైతుల భూములకు రక్షణ కవచం లాంటిదని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో మొదటి రోజు గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని కార్పొరేటర్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన చట్టం భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భద్రత కల్పిస్తుందన్నారు. మనిషికి ఆధార్‌కార్డు లాగానే భూమికి భూధార్ అని ప్రభుత్వం భూధార్ కార్డులను జారీ చేస్తుందని, రైతులకు ఉచిత న్యాయ సహాయం చేసే విధంగా వెసులుబాటు కల్పిస్తుందన్నారు.హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం కూడా ఉంటుందన్నారు. 4వ తేదీన రాయదుర్గం, పాన్‌మక్తా, దర్గాహుస్సేన్ షావాలి, ఖాజాగూడ గ్రామాలకు సంబంధించి దర్గాలోని వార్డు కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. భూభారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ చాలా కీలకమైందన్నారు. రైతుకు ఒక వేళ అన్యాయం జరిగితే అప్పీల్ చేసుకోవడం ద్వారా న్యాయాన్ని పొందవచ్చన్నారు. ఆర్‌డీఓ, జిల్లా కలెక్టర్, సీసీఎల్‌ఏ స్థాయిలో అప్పీల్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, నార్నేశ్రీనివాసరావు, ఆర్ఐ చంద్రారెడ్డి, రెవెన్యూ అధికారులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్వీయ క్రమశిక్షణ అవసరం

శిల్పాహోమ్స్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: క్రీడాకారులకు స్వీయ క్రమశిక్షణ అవసరం అని శిల్పాహోమ్స్ చైర్మన్ పి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్‌లోని ఏ జోన్ బ్యాడ్మింటన్ అకాడమీలో వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ టోర్నీ మంగళవారం ముగిసింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రొత్సహించాల్సిన అవసరాన్ని సంస్థలు గుర్తించాలన్నారు.అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. టోర్నీ నిర్వాహకుడు బీఏవీడి జిల్లా అధ్యక్షుడు కోసరాజు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యువిఎస్‌బాబు , అసోసియేషన్ ప్రతినిధులు వంశీధర్, సుభాష్‌రెడ్డి, పివిఎల్‌కుమార్, ఏవి రమణారెడ్డి, వేణుచౌదరి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

స్థల కబ్జాకు యత్నం

చందానగర్: శేరిలింగంపల్లి మండల జర్నలిస్టుల గృహ వసతికి చందానగర్‌లో కేటాయించిన స్థలాన్ని కొంతమంది కబ్జాకు యత్నించారు. కంచెను తొలగించి కడీలు ధ్వంసం చేశారు. విద్యుత్ శాఖ అధికారుల అనుమతి లేకుండా స్తంభాలు కూడా ఏర్పాటు చేశారు. దీనిపై జర్నలిస్టులు మంగళవారం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని కలిసి విషయం తెలియజేశారు. అనంతరం చందానగర్ సర్కిల్ -21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డిని కలిసి ఆ స్థలాన్ని రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనని కలిసిన వారిలో జర్నలిస్టు సంఘాల నాయకులు సలీం పాషా, కొండా విజయ్‌కుమార్, మాధవరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రసాద్, శేఖర్ సాగర్, విఠల్ రెడ్డి, రమేష్ సాగర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఏడీఈ లైన్స్ మధుకర్, ఏఈ తరుణ్ ఆదేశాల మేరకు 33 కెవీ కోసం వేసిన స్తంభాలను క్రేన్‌తో తొలగించారు.

అండర్‌బ్రిడ్జి కింద మురుగు

శేరిలింగంపల్లి: పాపిరెడ్డినగర్ అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు రవికుమార్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పాపిరెడ్డినగర్ అండర్ బ్రిడ్జి కింద మురుగు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు ఇబ్బందిగా మారాయని, జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బ్రిడ్జి కింద మురుగు నీటిని తొలగించాలని డిమాండ్ చేశారు. చందానగర్‌కు వెళ్ళే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గణపతి పూజ, అమ్మవారికి విశేష అభిషేకం, హోమాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు భీమలింగం మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

లిఫ్ట్ గుంతలో పడి మహిళ మృతి

గచ్చిబౌలి: ప్రమాదవశాత్తు భవనం పై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాములు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ బాలాఘాట్ జిల్లా దేవల్గాన్ గ్రామానికి చెందిన జైషీలా(39) భర్త కుంరాజు నగరానికి వచ్చారు. అంజయ్యనగర్‌లో ఫ్లాట్‌నెంబర్ 74లో నిర్మాణంలో ఉన్న భవనంలో కూలీలుగా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి లిఫ్ట్ గుంతలో పడింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్దిసేపటికి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగం.. చెట్టును ఢీకొన్న రెడిమిక్స్ లారీ



గచ్చిబౌలి: అతి వేగంగా వస్తూ రెడిమిక్స్ లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్లను ఢీ కొట్టింది. అటువైపు వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం ఏసీసీ రెడిమిక్స్ లారీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సమీపంలో ఎస్‌బీఐ ఎదురుగా చెట్టును ఢీ కొట్టి ఆగిపోయింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, సుమోటోగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు లారీని తొలగించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 33 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 29 మందికి రూ. వెయ్యి చొప్పున, నలుగురికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

గైనకాలజీ రంగంలో సౌందర్య చికిత్స అద్భుత పురోగతి

కాస్మెటిక్ గైనకాలజిస్ట్ డా. ప్రతిభానారాయణ్



రాయదుర్గం: భారతదేశంలో మొట్టమొదటి పునర్నిర్మాణ అండ్ కాస్మెటిక్ గైనకాలజీ విభాగాన్ని ఖాజాగూడలోని అంకుర ఆస్పత్రిలోని విమెన్, చిల్డ్రన్ ప్రీమియం 9ఎం ఆస్పత్రిలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీనియర్ ప్రసూతి వైద్యులు, కాస్మెటిక్ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రతిభానారాయణ్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి ఇంటిమేట్ వెల్‌నెస్, కాస్మాటిక్ గైనకాలజీ సెంటర్‌గా దీన్ని పిలుస్తారన్నారు. కేవల సౌందర్య పరమైన ఆకర్షణ కోసం కాకుండా వారి లైంగిక ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పని చేస్తుందన్నారు. అంకుర అండ్ 9ఎం ఆస్పత్రుల వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ ప్రసాద్ ఉన్నం మాట్లాడుతూ లైంగిక ఆరోగ్య సమస్యల చుట్టూ ఉన్న అపోహలను ఛేదించడమే మా లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, వైద్య బృందం పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

కొండాపూర్ కార్పొరేటర్ హమీద్‌పటేల్



అంజయ్యనగర్‌లో కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ హమీద్‌పటేల్

గచ్చిబౌలి: వర్షాకాలం దోమకాటు చాలా ప్రమాదకరమని జాగ్రత్తలు తీసుకోవాలని కొండాపూర్ కార్పొరేటర్ హమీద్‌పటేల్ అన్నారు. కొండాపూర్ డివిజన్ అంజయ్య నగర్‌కాలనీలో వన్ డే వన్ వార్డు ఎంటమాలజీ కార్యక్రమాన్ని కొండాపూర్‌లో ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ తనూజ, ఇన్‌చార్జి అబ్దుల్ సత్తార్, సూపర్‌వైజర్ లత, మహేందర్, శానిటేషన్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎఫ్ఏ రమేష్, హెల్త్ డిపార్ట్‌మెంట్ విజయ్, నాయకులు నర్సింహ్మాసాగర్, రూపారెడ్డి, రఫియాబేగం తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న మైనర్లు

జువైనల్ హోమ్‌కు తరలించిన మియాపూర్ పోలీసులు

మియాపూర్: ఇళ్లల్లో , వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు బాలురను మియాపూర్ పోలీసులు అరెస్టుచేసి జువైనల్ హోంకు తరలించారు. ఎస్ఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం...చందానగర్‌లోని హుడా కాలనీకి చెందిన 15, 16 సంవత్సరాల బాలురు సాయి గణేష్ అనే యువకుడితో కలిసి కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరిపై కూకట్‌పల్లి, గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఆటో దొంగిలించిన కేసులో చందానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఓ మహిళ చేతిలో నుండి ఫోన్‌లాక్కుని అసభ్యకరంగా ప్రవర్తించడంతో రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అదేవిధంగా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడుచోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడగా కేసులు నమోదయ్యాయి. కూకట్‌పల్లి, చందానగర్, రాయదుర్గం, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిల్లో ఏడు కేసులు నమోదైనట్లు తెలిపారు. హఫీజ్‌పేట్‌లోని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని రవికిరణ్ ఇంట్లో గత నెల 25వ తేదీ అర్ధరాత్రి సాయి గణేష్, ఇద్దరు మైనర్లతో కలిసి దొంగతనానికి యత్నించారు. ఆ సమయంలో శబ్దం కావడంతో ఇంటి యజమాని రవికిరణ్‌కు మెలుకువ రావడంతో పారిపోయారు. ఇంట్లో దొంగతనానికి యత్నించారని రవి కిరణ్ 26వ తేదీ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. కాలనీలో సీసీ కెమెరాలు పరిశీలించగా నిందితులను గుర్తించి బాలురను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. సాయిగణేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. బాల నేరస్తులను అరెస్ట్ చేసి వారి వద్దనుండి ఆటోను స్వాధీనం చేసుకుని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.